# ద్వారం

— కె. కె. మీనన్

'ప్రజాస్వామ్య' పరిరక్షకుడు 'రాజ్యాంగం' ద్వారం ముందు ఠీవిగా కూర్చొని, అలవోకగా నవ్వు కొంటున్నాడు. అతను అందంగా, ఆరోగ్యంగా, నానాదేశాల ప్రశస్థ బలవర్ధక ఔషధాలన్నీ సేవించి తెగబలిసి వున్నాడు.

అతనిముందు ఓ ఆగంతకుడు నిల్చున్నాడు. అతడు అమాయికంగా, అనాగరికంగా, అనారోగ్యంగా వున్నాడు. అతని ముఖంలో దేనికోసమో అంగలారుస్తోన్న దైన్యం ద్యోతకమౌతోంది.

"ఎవరు నువ్వు?" అడిగేడు రాజ్యాంగం.

"మీ కందరూ తెలుసంటారే! నన్నెరగరా?"

"ఊ.... తెలుసనుకో, వూరికే అడుగుతున్నాను."

"నన్ను సామాన్యు డంటారు...." చెప్పేడు ఆగంతకుడు.

"అయితే ఇక్కడి కెందుకొచ్చేవు?"

"ఇదేదో భూతల స్వర్గంలా కన్పిస్తోంది. లోపలి కెళ్లవచ్చా?"

"ఓ....!!"

తలుపు నెట్టేడు సామాన్యుడు. కదల్లేదు. బరువుగా దిట్టంగా వుంది.

పకపకా నవ్వేడు రాజ్యాంగం.

"ఎందుకలా నవ్వుతున్నావు?"

"అలా అందరూ తలుపులు నెట్టుకుని వెళ్ళిపోగలిగితే, ఇక్కడ నే నెందుకు?"

"వెళ్లవచ్చు నన్నావుగా!" అమాయికంగా అడిగేడు సామాన్యుడు.

"అందరూ వెళ్ళవచ్చునేది రూలు. అయితే వెళ్ళనివ్వటం, వెళ్ళనివ్వక

పోవటం—అది నా యిష్టం."

"అయితే వెళ్లనివ్వు"

"వెళ్లనిస్తాను...."

"ఎప్పుడు?"

"అదడక్కూడదు .."

పుష్పక విమానంలాంటి పచ్చటి కారొచ్చి ద్వారం ముందు ఆగింది.

హడావుడిగా లేచి వెళ్లి ద్వారం తెరి చేడు రాజ్యాంగం.

జర్రిపోతులా లోపలికి జారిపోయింది కారు.

సామాన్యుడు లోపలికి తొంగి చూసి:

"అక్కడంతా బలంగా, ఆరోగ్యంగా అవుపిస్తున్నారు" అన్నాడు.

"అవును...." అన్నాడు రాజ్యాంగం ద్వారం మూస్తో.

"అంతా నవ్వుతో కళకళలాడు తున్నారు."

"............"

"అంతా తెల్లటి బట్టల్లో మెరిసిపోతు న్నారు."

"అవును...."

"మేమంతా ఇలా వున్నాం, మరి వాళ్లలా వున్నారే!"

"ఎలా వున్నారు? అందరూ ఒకలానే వుంటారే! వుండాలే!!"

"నేనూ - వాళ్ళూ ఒకలానే కన్పిస్తు న్నామా?"

"నాకు అంతా ఓలానే కన్పిస్తు న్నారు."

"ఇంతకీ ఎవరు వాళ్ళు?"

"ప్రజాసేవకులు...."

"ఆ వెళ్ళిందెవరు?...."

"వైద్యులు...."

"ఎందుకు?"

"మందివ్వటానికి. వాళ్ళందరికీ అజీర్తి రోగాలుగా! తిన్నది అరగదు."

పకపకా నవ్వేడు సామాన్యుడు. నవ్వే వోపికలేక అతడు మెలి తిరిగిపోతున్నాడు.

"ఎందుకలా పిచ్చినవ్వు నవ్వుతావు?"

"లేకపోతే, అజీర్తట! తిన్నది అరగ దట!!"

"ఏం....అంత విడ్డూరంగా వుందా? నీ కెప్పుడూ అజీర్తి చెయ్యదా?"

"ఉహూ....ఆకలి మంటలేగాని అజీర్తి మాట నేనెరగను."

"అదేవిటి? .." ఆశ్చర్యంగా అడి గేడు రాజ్యాంగం.

"ఏమో! నీకే తెలియాలి."

ఆలోచనల్లో పడ్డాడు రాజ్యాంగం.

"అక్కడ వాళ్లంతా వుండగా లేంది నేనూ ఎందుకెళ్ళకూడదు?"

"వాళ్ళందర్నీ నువ్వే పంపించేవు. అది నువ్వు పంపించిన వాళ్లకోసం గాని నీ కోసం కాదు."

"నేను పంపించేనా! నే నసలు వాళ్లని ఎరగనే యెరగను!!"

"నీకు తెలీదులే ...నువ్వే పంపిం చేవు."

ఇప్పుడు సామాన్యుడు ఆలోచనల్లో పడ్డాడు.

"నువ్వేం ఆలోచిస్తున్నావో నాకు తెల్సు" అన్నాడు రాజ్యాంగం.

"........ . ..."

"వీడి చేతిలో కాస్త బరువుపెట్టి వెళ్ళిపోవచ్చునేమో అనుకుంటున్నావు కదూ!"

"అవును. నీ కెలా తెల్సింది?"

"నువ్వు ఏం చేస్తున్నావో, ఏం ఆలోచిస్తున్నావో నాకంతా తెలుస్తుంది" మహా దర్పంగా అన్నాడు రాజ్యాంగం.

"ఇచ్చేదా మరి?"

"ఊఁ..............." చెయి చాపాడు రాజ్యాంగం.

"ఎన్నో రోజులుగా కష్టపడి, ఏమైనా తిందామని దాచిపెట్టుకున్నది" అంటూ చేతిలో పెట్టేడు సామాన్యుడు.

మ హా రా జు లా తలపంకించేడు రాజ్యాంగం.

"వెళ్లనియ్యి మరి ..."



"ఊహూ ... వెళ్లనివ్వను...."

"మరెందుకు పుచ్చుకున్నావు?"

"నువ్వుఇస్తానన్నావు.పుచ్చుకున్నాను. ఒకవేళ పుచ్చుకోలేదనుకో. వీడు పుచ్చుకుంటే పంపించి వుండే వాడేమోనని నీకు అనుమానం పీకుతో వుంటుంది"

"ఇంతకీ, నాకు తెలీకడుగుతాను; నీకు పంపించే అధికారం వుందా?"

వికటాట్టహాసం చేసేడు రాజ్యాంగం.

"నాకు అన్ని ధికారాలూవున్నాయి" అన్నాడు గొంతు సవరించుకుంటో.

"మరెందుకు పంపవు?"

"పంపిస్తాను. కాని ...ఒకవేళ నీ రాక లోపలివాళ్లకి ఇష్టం లేదనుకో. మళ్లీ నా అధికారాలన్నీ తిరగదోడుతారు."

—నీకు అన్ని అధికారాలూ వున్నాయని నీ భ్రమ. కాని ఏమీలేవు. వాళ్లు... తల్చుకుంటే, నీ ఒంటిమీది గుడ్డలన్నీ ఒలిచేసి.... చెత్తకుండీలోకి తోసేగలరు ...

అదిరిపడ్డాడు రాజ్యాంగం. చుట్టూతిరిగి చూసేడు. ఎవరూ లేరు.

ఏళ్ళూ పూళ్ళూ నిరీక్షించేడు సామాన్యుడు. లోపలి వాళ్ల గురించే విస్మరించేడు. అతని ముందున్న ఆటంకం—

ఆ ద్వారమే......... ఆ ముందున్న ద్వారమే!

ఈ నిరీక్షణ కాలంలో ఎందరో లోపలి వాళ్ళు బైటకీ, బయటివాళ్ళు లోపలికీ, బయటికి వచ్చిన వాళ్లే కొందరు మళ్లీ లోపలికీ వెళ్ళటం చూసేడు సామాన్యుడు.

రాజ్యాంగం బాధ్యతల్లో ఏవేవో మార్పులూ చేర్పులూ వస్తోనే వున్నాయి. కాని, అవి ప్రతిసారీ సామాన్యుణ్ణి మరింత దూరంగా నెట్టేసేటందుకే వస్తున్నట్టనిపిస్తోంది.

సామాన్యుడికి వయసు మళ్లిపోతోంది. చూపుకూడా సన్నగిలుతోంది. అయినా స్వర్గధామాన్ని తల్చుకుని అలాగే, ఆ ద్వారం ముందు పడిగాపులు కాస్తున్నాడు.

ఆకస్మికంగా ఓనాడు గుంపొకటి వచ్చి పడింది. ఏవో కేకలు-నినాదాలు.

"ఎందుకలా అరుస్తున్నారు?" అడిగేడు సామాన్యుడు.

"దాన్నే స్వేచ్ఛ అంటారు."

"అంటే ...?"

"నీ కిష్టమైంది అనచ్చు. ఇష్టమైంది చేయచ్చు" అంటూనే చిన్న గేటులోంచి లోపలికెళ్ళేడు రాజ్యాంగం.

అక్కడి అలజడి అంతా కర్ణపేయంగా వినబడుతోంది సామాన్యుడికి.

వాళ్ల ముందుకెళ్లి అడిగేడు.

"ఎవరు బాబూ మీరు?"

"గుర్తుపట్టలేదా? మేం నీ సంతానం. యువతరం...." ఏక కంఠంతో జవాబిచ్చేరు.

"ఎందుకలా ఎగబడుతున్నారు?"

"లోపలి కెళ్లటానికి. అక్కడ సుఖాలన్నీ కొందరే అనుభవిస్తున్నారు. వాటిని అందరికీ పంచటానికి."

"వెర్రివాళ్లలా వున్నారు .." ఇన్నాళ్ల తన నిరీక్షణని తల్చుకుని కుంటుకుంటో ద్వారంవైపు నడిచేడు.

ఓ పటాలాన్ని వెంటపెట్టుకుని బయటికొస్తున్నాడు రాజ్యాంగం. వాళ్ల చేతుల్లో తుపాకులున్నాయి.

వాళ్ళు ముందుకెళ్లిపోయేరు.

"ఎవరు వాళ్లు?" అడిగేడు సామాన్యుడు.

"రక్షకులు...."

రక్షకులు జనం మీదికి తుపాకులు కాలుస్తున్నారు.

"ఎందుకలా చంపుతున్నారు?"

"వాళ్లు లోపలి వాళ్లని విమర్శిస్తున్నారు."

"ఏమైనా అనవచ్చనన్నావుగా...."

"అవును. కాని, లోపలి వాళ్లని కాదు."

యువతరానికీ, రక్షకులకీ కొన్నాళ్ల పాటు సంకుల సమరం సాగింది. చివరికి యువతరమే గెల్చింది. వాళ్లంతా రాజ్యాంగం మీద పడి పెడరెక్కలు విరిచి కట్టేరు.

"ఎందుకు నన్నిలా బంధిస్తున్నారు?" వాపోయేడు రాజ్యాంగం.

"అన్నిటికీ నువ్వే కారణం. నువ్వు అధికార పక్షపాతివి" గర్జించింది యువతరం.

"మీకు తెలీదనుకుంటాను. లోపలింకా చాలా ఆటంకాలున్నాయి...."

"నువ్వు పడిపోతే లోపలివన్నీ వాటికవే పడిపోతాయి."

ద్వారం తోసుకుని వెల్లువలా లోపలికి విజృంభించింది యువతరం.

ఈ కథకి పేరు సూచించిన మిత్రుడు
శ్రీ శీలా వీరాజుకు
అంకితం


